# జీవితం

—డా॥ మాధవరావు రేగులపాటి

జీవితం చలన బిందువు
అందుకే ముందుకు నడుస్తుంది
అప్పుడప్పుడు వెనక్కు కూడ

జీవితం చలన బిందువు
అందుకే అది సరళ రేఖ
కాదంటే వక్ర రేఖ

జీవితం అగ్గిపెట్టె అంచు
అందుకే దాని మీద
ఏదో రాపిడి జరుగుతుంది

జీవితం అగ్గి పుల్ల
అందుకే అప్పుడప్పుడు
భగ్గున మండుతుంది.

జీవితం ప్రాచీముఖాన
పూచిన రాగ ప్రసూనం
అందుకే సంధ్యారాగస్నాతం
కురుస్తుంది
సందేహపు పొరలను చీలుస్తుంది.

జీవితం మానవతా గర్భంలో వెలసిన
జ్యోతి
అందుకే
యుద్ధాల దరిద్రాల చీకటి సముద్రాల
ఆవలి గట్టును చూస్తుంది

జీవితం ప్రభంజనం
అందుకే
అశాంత అతృప్త మానస పారావార
తరంగాన్ని
ఎదురుతోంది; పైకి ఎగురుతుంది.

జీవితం ఒక ద్రవం
అందుకే సురాసురుల సముద్రమథనం
నుండి పుట్టే అమృతం
అప్పుడప్పుడది హాలాహలం.

జీవితం ఒక వచనం
జీవితం ఒక పద్యం.
అందుకే దానికి నిర్వచనం లేదు
అందుకే ఇంకా వాచకంగా మిగిలి ఉంది

సుబేదారి
వరంగల్ 506 010